# దాంపత్యంలో వ్యత్యాసాలు ★ శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు

సంఘంలో ఆడదాని దోపిడి అనేక ఆచారాలద్వారా జరుగుతున్నది. స్త్రీల శ్రేయస్సు కోరేవాళ్లీ ఆచారాలను ప్రతిఘటించటానికి ప్రయత్నించి సంఘానికి వెలి అవుతారు; కాని ఆ ఆచరాలు అడుగంటినమీదనే సంఘానికి అభ్యుదయం చేకూరుతుంది.

సుమారయిన తెలివితేటలు కలవాడు అయిదునిమిషాల్లో గ్రహించే విషయాన్ని ఒక్కొక్కసారి సంఘం యాభై సంవత్సరాలలోకూడా గ్రహించ లేకపోతుంది. దానికి తగినట్టే సంఘంయొక్క అభ్యుదయానికి విరుద్ధంగా పనిచెయ్యటానికి కంకణం కట్టుకున్న విద్రోహులుకూడా సంఘంలో ఉంటారు.

స్త్రీకి సంబంధించిన ఆచారాలలో చాలాభాగం దురాచారాలని మనం ఈ రోజుల్లో గ్రహించగలం. ఆడది పుట్టింటా, అత్తవారింటా హేయమైన బానిసజీవితం గడపటమూ, తండ్రి తాలూకు భర్తతాలూకు ఆస్తులమీద స్త్రీకి హక్కులు లేకపోవటమూ, అతిబాల్యంలో వివాహం చెయ్యటమూ, నడియవ్వనంలోనే నలుగురు పిల్లల తల్లి అయి వృద్ధాప్యంలో పడిపోవటమూ, భర్తపోతే తల గొరిగించుకుని, తిరిగి వివాహం చేసుకునే హక్కులేకుండా, ఏవిధమైన ఆనందంగాని పొందే యోగ్యతలేకుండా, రెండుపూటలా ఇంతతిండి అయినా తినరాకుండా, అడ్డమైనవాళ్లకీ చాకిరి చెయ్యటానికి మటుకే నోచుకోవటమూ మొదలైన దురాచారాలను గురించి ప్రజల అభిప్రాయాలు క్రమంగా మారుతూ వస్తున్నాయి. ఇదికూడా ఎంతో అలజడి జరిగిన మీదటగాని సాధ్యం కావటంలేదు.

వర్గశత్రుత్వం అతిహేయమైనది, నీచమైనది. దానికి లోబడి మానవులు పశువులకన్న అసహ్యంగా ప్రవర్తిస్తారు. ఆడదానికి అతి కనీసపు హక్కు లివ్వటానికి బిల్లుపెడితే దాన్ని సంఘం దారుణంగా ఎదుర్కొంటుంది.

నేనిప్పుడు దారుణమైన దురాచారాలను గురించి చర్చించి అది దోపిడికి ఎంత అనువుగాఉన్నదీమటుకే రాస్తున్నాను.

దాంపత్యంలో భార్యాభర్తల తేడాలు మనకి ఆచారంగా వస్తూ ఉన్నాయి. ఆర్థికంగా భార్య తాలూకువాళ్లకన్న భర్త తాలూకువాళ్లు కాస్తకలవారయితే అమ్మాయి అదృష్టవంతురాలంటారు. వరుడు కొంచెం తక్కువ ఆస్తిపరుడైతే మొగ్గ అటే ఉందంటారు. మొగ్గ మరీ జాస్తయితే ఇల్లరికంకింద జమకట్టేస్తారు.

రెండోది చదువు. సామాన్యంగా ఆడపిల్లలకి మగవాళ్లకొచ్చే చదువుండదు. ఎక్కడైనా పొరపాటున ఆడపిల్లకూడా బాగా చదువుకున్నదే అయితే, “వాడి మాట అదేం వింటుంది?” అంటారు. ఖర్మంచాలక భార్యేకొంచెం ఎక్కువ చదివినదయితే మొగుణ్ణిచూసి సంఘం ఒక్క నిట్టూర్పు విడిచి ఊరుకుంటుంది.

మూడోది వయసు. ఏకారణంచేతో భర్త భార్యకంటె పెద్దవాడై ఉంటే తప్ప అది సరయిన దాంపత్యంగా మనకి తోచదు. భార్యభర్తకన్న ఏ యేడాదో యేణ్ణర్థనో మాత్రమే ఎక్కువుంటే నరుడికి వయోహీనత ప్రాప్తించిందంటారు. భర్తకన్న భార్య బాగా పదిపన్నెండేళ్లు చిన్నదయితే ఎవరూ ఆశ్చర్యపడరు. పైపెచ్చు, “ఏమీ పరవాలేదు. పదేళ్లు తేడా అయితేమటుకేం? పిల్లలు పుట్టరా? సుఖపడరా?” అంటారు.

ఈ వాదన అవలంబించి మగవాడికి పదేళ్లు పెద్దదయిన పిల్లనుమటుకు కట్టరు!

ఈ వ్యత్యాసాలు పొరపాటునగాని సంఘశ్రేయస్సుకోసం పెద్దలు శాస్త్రరీత్యా నిర్ణయించినవిగాని కావు. మరెందుకొచ్చినట్టు? ఇవి ఎందుకాచారాలయినై? వీటిలో మార్పు తీసుకురావటానికి ప్రయత్నిస్తే సంఘం నిర్లిప్తత వహించి ఊరుకుంటుందా?

బాగా ఆస్తి ఉండి స్వతంత్రంగా తన భర్తని ఎన్నుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆడది తనకన్న భాగ్యవంతుడికోసం ఎందుకు చూస్తుంది? బియ్యే పాసయినపిల్ల ఐ.సి.ఎస్. వాడికోసం ఎందుకు వెతుకుతుంది? ఆడదానికెన్ని అవకాశాలిచ్చినా తన నెత్తిన కాళ్లుపెట్టే అర్హతగల భర్తకోసం ఎందు కెదురుచూస్తుంది?

ఇది బానిసబుద్ధి. అందుచేతనే అది దోపిడి విధానాన్ని



http://www.maganti.org/

పెంచే ఆచారాలకు లొంగి ఉంటుంది. ఈ ఆచారాలే బానిసతత్వానికీ జన్మస్థానం కూడానూ.

మాట వరసకి ఈ ఆచారాలంతంచేసి ఆడపిల్లలు తమ యీడువాళ్లనే, తమంతచదువూ డబ్బూకలవాళ్లనే పెళ్లాడే ఆచారం అమలులో పెడితే ఆడదాని జీవితంలో జరిగే పరిణామం మనం ఊహించవచ్చు. ఇటువంటి ఆచారం వచ్చిన మర్నాడు ఆడది మగవాడు తనకన్న ఉత్తమజాతి జంతువనే భావన విసర్జించగలుగుతుంది. ప్రతివిషయంలోనూ తమభర్తకి లోకువే అనే జ్ఞానం ఆమె జీవితాన్ని వెంబడించదు. భర్తని సులభంగా తన సంఘంలో వాడుగా స్వీకరించి, అతని సంఘంలో తానుకూడా స్థానం సంపాదించుకోగలుగుతుంది. భర్త చలాయించే చిల్లరధాష్టీకాన్ని అయిదు నిమిషాలు చలాయించదు. అసలు భర్తకూడా ధాష్టీకంచలాయించటానికి ప్రయత్నించదు. పెళ్లయి భర్త దగ్గిరకి పోవటమంటే ఆడదానికప్పుడు మరో కొత్త జన్మ అనిపించదు. భార్యకి భర్త పంచుకోలేని ఒక రహస్య మానసిక జీవితం అవసరంలేదు.

దాంపత్యంలో వ్యత్యాసాలు అంతం చెయ్యటంవల్ల సంఘానికి ఉమ్మడిగా ఎంతప్రయోజనం ఉందో ఎవరూ సరిగా గ్రహించలేదని నా అనుమానం. ఏ విషయం గురించిగాని మనం ఆలోచించటం ప్రారంభిస్తేగాని క్రమంగా దాని సత్యం బయటపడదు. నలుగురూ—ముఖ్యంగా స్త్రీలు—ఈ విషయం గురించి ఆలోచించటం ప్రారంభించగలందులకే ఈ నాలుగుముక్కలూ రాశాను. ఈ విషయం ముందుముందు ఇంకా తెలివైన మనుషులు ఇంకా విజ్ఞానపూరితమైన విషయాలు రాసి సంఘం కళ్లు తెరుస్తారని నాకు దృఢమైన నమ్మకం ఉంది.

★


బిడ్డ ఆహారం తిననప్పుడు



తన జీర్ణకోశం సరిగా లేదని, తనకు కావలసింది గ్రైప్ సిరప్ ఐ టి ఎల్. అని పాపాయి ఏడుపుద్వారా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడన్నమాట వాయువును హరించే ఉత్తమ గుణాలు దానిలో ఉన్నవి అది బిడ్డలకు దంతములు ఏర్పడే సమయంలో కలిగే అజీర్ణమును, వాంతులు, అతిసారమును సహా నివృత్తి చేస్తుంది. బిడ్డ ఆరోగ్యం సరిగా లేనపుడు గ్రైప్ సిరప్‌నే ఇవ్వండి.

★ ★ ★

గ్రైప్ సిరప్‌నే అతనికి ఇవ్వండి

సెల్లింగ్ ఏజంట్లు; బెస్ట్ అండ్ కో., లిమిటెడ్.

I·T·L

GPK-2-TG




http://www.maganti.org/

Source: A.P. Press Academy Website, Andhra Mahila Magazine – May 1945

Disclaimer: This topic/article/write-up of Sri Kodavatiganti Kutumba Rao has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan